# పట్టభద్రుల ఓటర్లు 4.61 లక్షలు

• ఎమ్మెల్సీ తుది ఓటరు జాబితా విడుదల

నల్లగొండ, ఏప్రిల్ 4 : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితాను నల్లగొండ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరిచందన గురువారం విడుదల చేశారు. మొత్తం 4,61,806 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నట్లు లెక్క తేలింది. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 83,606 మంది, అత్యల్పంగా సిద్దిపేటలో 4,671 మంది ఓటర్లు ఉన్నారు. నవంబర్1, 2023 అర్హత తేదీ ఆధారంగా రూపొందించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అనంతరం తుది ఓటరు జాబితాను ప్రకటించారు. నియోజకవర్గంలో 12 జిల్లాల కలెక్టర్ కార్యాలయాలు, ఆర్డీఓ, తాసీల్దార్ కార్యాలయాలతోపాటు, సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో సైతం ఈ జాబితాను ప్రచురించినట్లు కలెక్టర్ తెలిపారు.



ఎంసీఎంసీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

## పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకోవాలి

• కలెక్టర్ హరిచందన

నల్లగొండ, ఏప్రిల్ 1 : అత్యవసర సేవలు అందించే శాఖల ఉద్యోగులు లోక సభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల నోడల్ అధికారులతో ఆమె సమీక్షించారు. ఫారం-12డీ అందజేసి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పోస్ట్ ద్వారా వేసే ఓటు కాదని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ కేంద్రాలకు ఉద్యోగి స్వయంగా వెళ్లి ఓటు వేయాల్సి ఉంటుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనే ఉద్యోగుల వివరాలన్నీ ఎక్సెల్ షీట్‌లో పొందుపరచాలని జిల్లా నోడల్ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓడీ రాజ్యలక్ష్మి, పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారిని వి.శ్రీదేవి పాల్గొన్నారు.

### ఎంసీఎంసీ ద్వారా నిర్దేశించిన సమయంలో అనుమతి ఇవ్వాలి

లోక సభ ఎన్నికల సందర్భంగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ద్వారా నిర్దేశించిన సమయంలో రాజకీయ ప్రకటనలకు అనుమతులను ఇవ్వాలని కలెక్టర్ హరిచందన అన్నారు. ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించాలని ఆదేశించారు. లోక సభ ఎన్నికల సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ, మీడియా కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే పెయిడ్ న్యూస్, ప్రకటనలను పరిశీలించాలని, అనుమతులు సకాలంలో ఇవ్వాలని సమాచార శాఖ ఏడీ వెంకటేశ్వర్లును కలెక్టర్ ఆదేశించారు.



# నల్లగొండలో మెగా ఆటో షో

నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే ఆధ్వర్యంలో నిర్వహణ

ఈ నెల 6,7 తేదీల్లో ఎన్జీ కళాశాల ఆవరణలో ఏర్పాటు

స్కూటీ నుంచి ఆడీ కారు వరకు ఆటో షోలో ప్రదర్శన..

ప్రతి వాహనాన్ని టెస్ట్ డ్రైవ్ పొందే చాన్స్





నల్లగొండ, ఏప్రిల్ 4 : నల్లగొండలో ఈ నెల 6, 7వ తేదీల్లో మెగా ఆటోషో జరుగనున్నది. నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే ఆధ్వర్యంలో పవన్ మోటర్స్ ప్రధాన స్పాన్సర్స్‌గా జిల్లా కేంద్రంలోని నాగార్జున (ఎన్‌జీ) డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఆటో షోలో స్కూటీ నుంచి ఆడీ, బెంజ్ కారు వరకు ఆయా కంపెనీల యాజమాన్యాలు ప్రదర్శించనున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ షో ఉండనుండగా వినియోగదారులు తమకు నచ్చిన వాహనాన్ని ఒక లుక్ వేయడంతో పాటు టెస్ట్ డ్రైవ్ చేసుకునే అవకాశం ఉంది. అన్ని కంపెనీలకు చెందిన టూవీలర్లు, కార్లు ఈ షోకు వస్తున్నాయి. ప్రధానంగా మహిళలు, యువతకు కావాల్సిన ప్రతి వాహనం ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నల్లగొండలో అందుబాటులో లేని ఎలక్ట్రిక్ వాహనాలు, లగ్జరీ కార్లతో పాటు రైతులకు కావాల్సిన ట్రాక్టర్లు, యువతను ఎట్రాక్ట్ చేసే స్టైలిష్ బైక్స్, మహిళలను ఆకర్షించే స్కూటీలు ఈ సారి నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆయా కంపెనీల నుంచి తెప్పించి ప్రదర్శనకు పెడుతున్నారు.







# పాలనను గాలికొదిలేశారు

• కాంగ్రెస్ పాలనలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
• మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
• సాగర్‌లో కోతులు పడ్డ వాటర్ ట్యాంకు పరిశీలన



కోతులు పడిన వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భగత్ కుమార్

హాలియా, ఏప్రిల్ 4 : కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికి వదిలేయడంతో మున్సిపల్ శాఖలో నిర్లక్ష్యం అలుముకున్నదని, ప్రజలకు తాగునీటిని అందించే వాటర్ ట్యాంకులను తనిఖీ చేసే సమయం కూడా అధికారులకు లేదా? అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. నాగార్జున సాగర్ హిల్‌కాలనీలో కోతులు పడ్డ వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, నోముల భగత్‌కుమార్‌తో కలిసి గురువారం పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ 2014కు ముందు నాగార్జున సాగర్ గ్రామపంచాయతీ మున్సిపాలిటీ కాకుండా ఉండేదన్నారు. పక్కనే సాగర్ జలాశయం ఉన్నా ఇక్కడి ప్రజలకు తాగునీరు దొరికేది కాదని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక్కడి ప్రజల సమస్యలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నాగార్జున సాగర్‌ను నందికొండ మున్సిపాలిటీగా చేయడం జరిగిందన్నారు. పదేండ్లుగా నాగార్జున సాగర్‌లో ఏ సమస్యలూ లేవని, బీఆర్‌ఎస్ హయాంలో నాలుగేండ్ల పాటు నాగార్జున సాగర్‌తో పాటు రాష్ట్రమంతా ఇంటింటికీ తాగు నీరు అందించామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నందికొండ మున్సిపాలిటీలో మళ్లీ సమస్యలు నెలకొన్నాయని, మున్సిపల్ శాఖలో నిర్లక్ష్యం అలుముకుందని అన్నారు. ప్రజలకు తాగునీటిని అందించే వాటర్ ట్యాంకులను నిత్యం తనిఖీ చేసే సమయం కూడా అధికారులకు లేకుండా పోయిందని విమర్శించారు. కోతులు పడిన ట్యాంకు నీళ్లు తాగిన ప్రజలు రోగాలబారిన పడే అవకాశం ఉన్నదన్నారు. ప్రభుత్వం వారికి ఆరోగ్య పరీక్షలు చేయించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నదన్నారు. తెలంగాణలో దోచుకొని ఢిల్లీకి ముడుపులు పంపే పనిలో రేవంత్‌రెడ్డి సర్కార్ బిజీగా ఉన్నదని ఆరోపించారు. గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారని, పంటలకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాలేదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బయటకు రాగానే నీళ్లు కాల్వలలకు వదిలారని తెలిపారు. కరువు సమయంలో ప్రత్యేక ప్రణాళికతో తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పల్లా ప్రవీణ్, చెన్ను సుందర్‌రెడ్డి, అల్లి పెద్దిరాజు, రమేశ్‌జీ పాల్గొన్నారు.



నక్క రాములును బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న రవీంద్రకుమార్

## సొంత గూటికి మేడారం ఎంపీటీసీ

• బీఆర్‌ఎస్‌లో చేరిన నక్క రాములు

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 4 : ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన మండలంలోని మేడారం గ్రామానికి చెందిన ఎంపీటీసీ నక్క రాములు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. గురువారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు తప్ప 120 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎల్గూరి వల్లపురెడ్డి, రాష్ట్ర నాయకులు పల్లా ప్రవీణ్‌రెడ్డి, తోటకూరి పరమేశ్‌యాదవ్, ఎర్ర యాదగిరి, మాద సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

## పానగల్‌లో ధాన్యం దందా..!

• అనధికారికంగా ఐకేపీ కేంద్రం ఏర్పాటు



పానగల్‌లో అనధికారికంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం

నల్లగొండ, ఏప్రిల్ 4: నల్లగొండ మున్సిపాలిటీలోని పానగల్‌లో యథేచ్ఛగా ధాన్యం దందా కొనసాగుతున్నది. అక్కడ ఇటీవల అనధికారికంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. సాధారణంగా అర్బన్ ప్రాంతాల్లో పీఏసీఎస్‌లు మాత్రమే ఈ కొనుగోళ్లు చేపట్టాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ కొనుగోలు కేంద్రంలో ప్రైవేటు తూకం యంత్రాల ద్వారా కొనుగోళ్లు జరుపుతూ రైతుల నుంచి ధాన్యం ఎక్కువ మొత్తంలో తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. నల్లగొండ మండలంలోని చందనపల్లి, పానగల్‌కు చెందిన రైతులు ఆంజనేయస్వామి ఆలయం పక్కన పోయగా ఖాజీరామారం వీఓఏ ఈ ధాన్యం తూకం వేయిస్తున్నట్లు అక్కడున్న రైతులు పేర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రం అనేది సంబంధిత శాఖ ద్వారా అనుమతి తీసుకొని పట్టణాల్లో అయితే పీఏసీఎస్‌ల ద్వారా, గ్రామాల్లో అయితే ఐకేపీల ద్వారా కొనుగోళ్లు జరుగుతాయి. అన్నింటిని విస్మరించి చేస్తున్న ఈ దందాలో తూకం పేరుతో రైతులు బలవుతున్నారు. ఇది ఖాజీరామారం వీఓఏ ద్వారా కొనుగోళ్లు చేస్తున్నట్లు స్థానిక రైతులు తెలిపారు. పక్కనే ఆర్జాలబావిలో పీఏసీఎస్ సెంటర్ ఉండగా ఇక్కడ అనాధికారికంగా కొనాల్సిన అవసరమేంటని అర్థం కాని ప్రశ్న. ఇది డీఆర్‌డీఏ యంత్రాంగం కనుసన్నల్లోనే జరుపుతున్నట్లు సమాచారం. ఇక్కడ ధాన్యం ఖాజీరామారం ద్వారా ట్రక్ షీట్స్ జనరేట్ చేస్తున్నట్లు తెలుస్తున్నది.

**ఐకేపీకి సంబంధం లేదు**

పానగల్‌లో ఐకేపీలకు సంబంధించి ఎలాంటి సబ్ సెంటర్లు ప్రారంభించలేదు. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం రాశులు ఎవరివో తెలియదు. ఆ ధాన్యానికి మాకు సంబంధం లేదు. అయినా ఐకేపీలు పట్టణాల్లో ఏర్పాటు చేయలేదు.

– వినోద, ఏపీఎం, నల్లగొండ

## వ్యవసాయ మోటర్లకు కరెంట్ కట్‌పై సర్కారు సీరియస్

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 4 : ఏఎమ్మార్పీ ప్రాజెక్టు పరిధిలో కాల్వ వెంట ఉన్న వ్యవసాయ మోటర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. వ్యవసాయ మోటర్లకు కరెంట్ కట్‌పై నమస్తే తెలంగాణలో వచ్చిన కథనానికి ట్రాన్స్‌కో సీఎండీ, రాష్ట్ర స్థాయి అధికారులు స్పందించి విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా మండల విద్యుత్ అధికారులకు సమాచారం అందజేసి కనెక్షన్లు తొలగించిన వారిపై దేవరకొండ ఏడీఏ విచారణ చేపడుతున్నారు. రెండు రోజుల్లోనే తిరిగి ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేపట్టారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఎస్‌ఈని వివరణ కోరగా కింది స్థాయి నుంచి నివేదిక రావాల్సి ఉన్నదని, నివేదిక అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.




